క్లుప్తంగా

ఆధ్యాత్మిక పుస్తకానికి వైఎస్ జగన్ అభినందన



తాడేపల్లిలో ఆధ్యాత్మిక పుస్తకాన్ని అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్

దెందులూరు: ఆల్ ఇండియా పాస్టర్ ఫెడరేషన్ నేషనల్ సెక్రటరీ డాక్టర్ రెవరెండ్ జీవన్ కుమార్ రచించిన ఆధ్యాత్మిక పుస్తకం ఆధ్యాత్మిక అభివృద్ధికి, జీవన విధానానికి తోడ్పడుతుందని వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం తాడేపల్లిలో మాజీ హోంమంత్రి తానేటి వనిత డాక్టర్ జీవన్ కుమార్ రచించిన పుస్తకం గురించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జీవన్‌కుమార్‌ను, ఆల్ ఇండియా పాస్టర్స్ ఫెడరేషన్ నేషనల్ చైర్మన్ బిషప్ రెబ్బా ఇమ్మానియేల్‌ను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు.

కృత్రిమ కాలు కోసం అభ్యర్థన



త్రిచక్ర వాహనం మీద కాలం వెళ్లదీస్తున్న అందుగుల భూషణం

ఉంగుటూరు: ఇతడి పేరు అందుగుల భూషణం, వయస్సు 72 సంవత్సరాలు, ఉంగుటూరు మండలం బొమ్మిడి గ్రామం. చేపలు పట్టుకునే వృత్తి చేస్తుండేవాడు. ఈ నేపథ్యంలో కాలుకు చేపముల్లు దిగింది. అయితే ఇతడు పెద్దగా లెక్క చేయలేదు. సెప్టిక్ అయ్యి కాలు తీసేశారు. 4 సంవత్సరాల నుంచి అతనికి తిప్పలు తప్పలేదు. కుటుంబానికి ఆధారం లేకుండా పోయింది. కనిపిస్తున్న అధికారికి, ప్రజా ప్రతినిధికి తన గోడును వెళ్లదీస్తున్నాడు. ప్రస్తుతం అతడికి కృత్రిమ కాలు కావాలని కోరుతున్నాడు. అందుకు 50 వేలు పైనే ఖర్చు అవుతుంది. అంత భరించే శక్తి అతడి కుటుంబానికి లేదు. ఈ క్రమంలో ఇటీవల గ్రామంలో పల్లెపల్లెకు ధర్మరాజు కార్యక్రమంలో ఎమ్మెల్యేకు అందుగుల భూషణం మొర పెట్టుకున్నాడు.

60 మందికి ఉచిత వైద్య పరీక్షలు



బాదంపూడిలో ఉచిత వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

ఉంగుటూరు: బాదంపూడి దత్తబాల సుబ్రహమణ్యస్వామి ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వైద్యులు సేవలందించారు. 60 మంది పేషెంట్లకు పరీక్షలు నిర్వహించారు.ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసు పర్యవేక్షణలో ఈ వైద్య శిబిరం నిర్వహించారు.

189 వితంతు పింఛన్ల మంజూరు

ఉంగుటూరు: మండలానికి 189 వితంతు పింఛన్లు మంజూరు అయినట్లు ఎంపీడీవో రాజ్ మనోజు వెల్లడించారు. ఎ.గోకవరానికి 4, బాదంపూడికి 12, బొమ్మిడికి 7, చేబ్రోలు 20 పింఛన్లు మంజూరు అయినట్లు ఎంపీడీవో తెలిపారు. అలాగే గొల్లగూడేనికి 9, గోపాలపురానికి 4, గోపీనాథపట్నానికి 3, కైకరానికి 29, కాకర్లమూడికి 8, నాచుగుంటకు 8, నారాయణపురానికి 19, నీలాద్రిపురానికి 1, రావులపర్రుకు 2, రాచూరుకు 9, ఉంగుటూరుకు 9, ఉప్పాకపాడుకు 6, వెల్లమిల్లి పంచాయతీకి 19, యర్రమిల్లిపాడుకు 5, ఉంగుటూరుకు–29 మంజూరు అయ్యాయని ఎంపీడీవో వివరించారు.

పాఠశాలలో బాలుడిపై వ్యక్తి దాడి

జంగారెడ్డిగూడెం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో విద్యనభ్యసిస్తున్న బాలికను అదే పాఠశాలలో చదువుతున్న బాలుడు ఏడిపిస్తున్నాడని, విషయం తెలుసుకున్న బాలికకు వరుసకు సోదరుడు అయిన చిన్న బుధవారం పాఠశాలకు వెళ్లి బాలుడిపై దాడి చేశాడు. దీంతో ఉపాధ్యాయులు వెంటనే సదరు వ్యక్తిని అడ్డుకుని, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై షేక్ జబీర్ పాఠశాలకు వెళ్లి వివరాలు తెలుసుకుని, బాలుడిని కొట్టిన చిన్నను మందలించారు. అనంతరం హెచ్‌ఎం సోమశేఖర్ బాలుడు, బాలిక పెద్దలకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

గోసంరక్షణ శాలకు తవుడు అందజేత

ద్వారకాతిరుమల: శ్రీవారి గోసంరక్షణ శాలకు భీమవరానికి చెందిన రుద్రరాజు సతీష్ రాజు బుధవారం రూ.1.15 లక్షలు విలువైన 3 టన్నుల తవుడు (దాణా)ను విరాళంగా అందజేశారు. వ్యానులో తీసుకొచ్చిన తవుడును ఆలయ అధికారులకు అందించగా, దాతను వారు ప్రత్యే కంగా అభినందించారు. దాతకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలను అందించారు.

నీరు పారదు.. యూరియా దొరకదు

- సాగు సాగేదెలా ?
- ఆందోళనలో రైతన్నలు
- పట్టించుకోని అధికారులు



పెదపాడు: వరి సాగు సాగక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అడుగడుగునా గండం ఎదురవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి ఎద్దడి కారణంగా కొన్ని ప్రాంతాల్లో వరి నాట్లు ఆలస్యంగా సాగుతున్నాయి. ఏవో తంటాలు పడి నాట్లు వేశారు. ఇదిలా ఉంటే యూరియా దొరకని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. రైతులకు నాట్లు వేయగానే అవసరమైన ఎరువు యూరియా కావడంతో రైతులు యూరియా కోసం ఎదురు చూస్తున్నారు. కృష్ణా డెల్టా రైతాంగం సమస్యలు ఎదుర్కొంటున్నారు. దెందులూరు నియోజకవర్గంలోని పెదపాడు దెందులూరు, ఏలూరు రూరల్ గ్రామాల రైతులకు కృష్ణా కెనాల్ ప్రధానాధారం. నియోజకవర్గంలో కృష్ణా డెల్టాలో దెందులూరు నియోజకవర్గంలో 50,400 ఎకరాలు వరిసాగు చేస్తున్నారు. పెదపాడు మండలంలో 17,500 ఎకరాలు, దెందులూరు మండలంలో 17,280 ఎకరాలు, పెదవేగిలో 7,500, ఏలూరులో 8,120 ఎకరాలు వరిసాగు చేస్తున్నారు. ఈ సీజన్‌లో వర్షపాతం తగ్గడంతో కృష్ణా డెల్టాలో నాట్లు ఆలస్యంగా సాగుతున్నాయి.

దొరకని యూరియా

ఎరువులు దొరకని పరిస్థితులు నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎరువులు విక్రయదారులకు ఎరువులు సరఫరా కాకపోవడంతో రైతులకు ఎరువులు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్క పెరుగుదలకు అవసరమైన యూరియా అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

గతంలో రైతు బజారులో..

గతంలో అన్ని రకాల ఎరువులు రైతు బజారులో అందుబాటులో ఉండేవి. రైతులకు సౌకర్యవంతంగా ఉండేది. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు నిల్వలు లేకపోగా బహిరంగ మార్కెట్‌లో కూడా 4 నెలలుగా యూరియా దొరకడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఇలా అయితే వ్యవసాయంపై ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని, ముందస్తుగా అధికారులు గుర్తించి కొరత లేకుండా చూడాలని కోరుతున్నారు.

ఆదివారం డీసీఎంఎస్, సొసైటీల్లో ఎరువులు

ఉండగా వ్యవసాయ అధికారి షేక్ ఇమామీ ఖాసిమ్‌ను వివరణ కోరడంతో ఆదివారం యూరియా సొసైటీలు, డీసీఎంఎస్‌కు చేరుకున్నాయని, ఎరువుల విక్రయం జరుగుతోందని, రైతులు తమ పొలం, ఆధార్ జిరాక్స్‌లతో వెళ్లి తీసుకోవచ్చని చెప్పారు. ఏవో సమస్యల కారణంగా ప్రైవేట్ డీలర్లకు మాత్రం యూరియా సరఫరా కావడం లేదని చెప్పారు. ఎరువుల విక్రయదారులకు యూరియా సరఫరా కావడం లేదని ప్రభుత్వం ఎరువుల సరఫరాపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

రోడ్లకు మరమ్మతులు



రోడ్లకు మరమ్మతులు చేస్తున్న నేషనల్ హైవే సిబ్బంది

దెందులూరు: రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటూ, ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయంతో పనిచేస్తుందని డీటీఆర్‌బీ సిబ్బంది తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాలపై నేషనల్ హైవేలో మరమ్మతులకు కాంట్రాక్టర్ వరాహా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూ.1.20 కోట్లు మంజూరు చేసి పనులు నిర్వహించారు. రోడ్డు సరిగ్గా లేకపోవడం, ఎత్తుపల్లాలు, గోతుల ప్రాంతాలను గుర్తించి వాటి మరమ్మతులు చేయిస్తామన్నారు. రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీ రైల్వే వంతెన, చింతలపూడి దుగ్గిరాల వంతెన, దెందులూరు–కొవ్వలి వంతెన, సత్యనారాయణపురం వంతెనలను ప్రమాదభరిత ప్రదేశాలుగా గుర్తించామన్నారు.

‘బాబు’ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

- ఏడాది పాలనలో ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం
- కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో మోసాలను ప్రజలకు వివరించాలి
- వైఎస్సార్ సీపీ మండల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వాసుబాబు

నిడమర్రు: చంద్రబాబు ఏడాది పాలనలో చేసిన మోసాలను ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పిలుపునిచ్చారు. బుధవారం జెడ్పీటీసీ కోడే కాశి, యువజన విభాగం అధ్యక్షుని కార్యాలయం వద్ద నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంపై మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వాసుబాబు మాట్లాడుతూ పార్టీలోని స్టూడెంట్ వింగ్, మహిళా వింగ్, వలంటీర్ వింగ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వింగ్‌లతో పాటు పార్టీ శ్రేణులకు బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే ఈ కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. ఎన్నికలప్పుడు చంద్రబాబు ఇచ్చిన హామీలు ఏమిటి, ఈ ఏడాది పాలనలో ఆయన ప్రజలను ఏ విధంగా మోసం చేశారనే అంశాలతో కరపత్రంలోని క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా ప్రతి ఇంటికి తీసుకెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. బాబు పాలనలో సూపర్ సిక్స్.. సూపర్ ఫ్లాప్ అయినట్లు ఇంటింటికీ చేరేలా కృషి చేయాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులను గెలిపించుకొని పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఇప్పటికే గ్రామాల్లో కూటమి నేతల మధ్య అధిపత్య విభేదాలు భగ్గుమంటున్నాయన్నారు. ఏడాదిగా ప్రజలు చంద్రబాబు పాలనలో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. రాబోవు స్థానిక సమస్యల ఎన్నికల్లో ప్రజల మద్దతు తప్పనిసరిగా వైఎస్సార్ సీపీ వైపే ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

గ్రామ స్థాయిలో పార్టీ నిర్మాణానికి కృషి

వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు పార్టీ సంస్థాగతంగా పటిష్టతకు గ్రామస్థాయిలో 10 మంది సభ్యులతో అనుబంధ కమిటీలు నిర్మించుకోవాలని మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు సూచించారు. ప్రతి గ్రామంలో యువజన, మహిళ, విద్యార్థి, సోషల్ మీడియా, రైతు, కార్మిక విభాగాల కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న ప్రతి కార్యకర్తకు తాను అండగా నిలబడతానని వాసుబాబు హామీ ఇచ్చారు. గ్రామ కమిటీలతో పాటు బూత్ లెవెల్ కమిటీల నిర్మాణం పూర్తి చేసేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. కార్యకర్తల కోసం ఒక ప్రత్యేక యాప్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఏ కార్యకర్త యినా కూటమి నాయకులు, అధికారులతో వేధింపులకు గురైతే ఆ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని ఫిర్యాదు చేసే అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. సంబంధిత ఆధారాలను అప్‌లోడ్ చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కోడూరి రాంబాబు, గణపవరం, భీమడోలు మండల పార్టీ అధ్యక్షుడు దండు రాము, రాయపాటి సత్య శ్రీనివాస్, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి శ్రీనివాస్, నియోజకవర్గం బీసీ సెల్ అధక్షుడు తుమ్మగుంట రంగ, రాష్ట్ర బూత్ కమిటీ కార్యదరి ఎలిశెట్టి పాపారావు బాబ్జి, ఎంపీటీసీ, పార్టీ ఉపాధ్యక్షురాలు ముదునూరి త్రవేణి, మాజీ సొసైటీ అధ్యక్షుడు చినిమిల్లి శ్రీను, వేగేశ్న సుబ్బరాజు, వైస్ ఎంపీపీలు సమయం వీరరాఘవులు, బండి విస్సాకు రమణ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ షకీల్, సీనియర్ నేతలు పాతూరి శ్రీనివాసరాజు, అల్లాడు అబ్బులు, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అనుబంధ విభాగాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నిర్మలకుమారి

గణపవరం: మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యని, దీనిని అరికట్టేందుకు ప్రజలు కలిసికట్టుగా పనిచేయాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. బుధవారం ప్రపంచ మానవ అక్రమ రవాణా దినోత్సవం సందర్భంగా కాలేజీలో విద్యార్థులకు మహిళా సాధికార విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మానవ అక్రమ రవాణా ఒక సామాజిక సమస్యగా ఉందని, విద్యార్థినులు ఈ విషయంలో పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మాట్లాడిన పలువురు అధ్యాపకులు అక్రమ రవాణా జరిగే విధానాలు, మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

బ్యాంకుల భద్రతకు ప్రత్యేక చర్యలు



బ్యాంకు మేనేజర్లతో మాట్లాడుతున్న సీఐ రాజశేఖర్

దెందులూరు: బ్యాంకుల భద్రతకు ప్రత్యేక చర్యలు సమష్టిగా తీసుకోవాలని పెదవేగి సమై రాజశేఖర్ అన్నారు. బుధవారం సీఐ కార్యాలయంలో ఆయన దెందులూరు, పెదపాడు, పెదవేగి బ్యాంకు మేనేజర్లతో బ్యాంకుల భద్రత రక్షణ చర్యలపై అవగాహన సమావేశం నిర్వహించారు. పోలీస్ శాఖ బ్యాంకుల ప్రతినిధుల సహకారంతో ప్రజల ఆస్తుల భద్రత కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రతి బ్యాంకు ఏటీఎం సెంటర్ వద్ద తప్పనిసరిగా సెక్యూరిటీ గార్డ్‌ను నియమించాలన్నారు. హై రిజల్యూషన్ కలిగిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రవేశద్వారం క్యాషియర్ కౌంటర్ ఏటీఎం గదుల్లో సీసీటీవీ ఫుటేజీ 30 రోజుల పాటు భద్రంగా ఉంచాలన్నారు. రాత్రి సమయంలో ఏటీఎం సెంటర్లను సరిగ్గా పర్యవేక్షించే విధంగా సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎటువంటి అనుమానాస్పద సంఘటనలు గమనించినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు బ్యాంక్ సిబ్బంది సమాచారం ఇవ్వాలన్నారు. సిబ్బందికి కస్టమర్లకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత బ్యాంకు నిర్వాహకులదేనన్నారు. బ్యాంకు భద్రతపై పరస్పర సమన్వయం సమాచారం భాగస్వామ్యం బాధ్యతాయుతమైన చర్యలు అమలయ్యే దిశగా సమష్టి సహకారం ఉంటేనే బ్యాంకుల భద్రత నూరుశాతం సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో మూడు మండలాల బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కుక్కునూరు: మండలంలోని లచ్చిగూడెం గ్రామస్తులకు నెమలిపేట ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన గోదావరి వరద పునరావాస సహాయక కేంద్రంలో సరైన మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ బుధవారం సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా నాయకులు కుక్కునూరు తహసీల్దార్ పి.రమేష్ బాబుకు వినతిపత్రం అందించారు. పునరావాస కేంద్రంలో ఇళ్లలకు బాత్‌రూమ్‌లకు డోర్లు లేవని, తాగునీరు లేదని, విద్యుత్ సదుపాయం, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్, వైద్య ఆరోగ్య శాఖ కమ్యూనిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలను పూర్తిచేసి నిర్వాసితులకు సీరియల్ నంబర్ల ప్రకారం ఇళ్లను కేటాయించాలని పేర్కొన్నారు. పోలవరం ఆర్ అండ్ ఆర్ ఇంటి నిర్మాణాలకు తక్కువ విలువలు వచ్చిన వారికి రీ సర్వే చేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాపంథా జిల్లా నాయకులు షేక్ గౌస్, జంగారెడ్డిగూడెం డివిజన్ సభ్యుడు మచ్చా ప్రశాంత్, మండల కమిటీ సభ్యులు పెంకె వీరబాబు, సున్నం రాణి, మచ్చా లక్ష్మయ్య, పొడియం లక్ష్మణ్‌రావు, సున్నం రాజు, మడివి ఓశయ్య, మడకం శంకర్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న గోపాల యాదవ్

కామవరపుకోట: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కలిసి పని చేద్దామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోరుముచ్చు గోపాల్ యాదవ్ అన్నారు. బుధవారం కంటమనేని వారి గూడెంలో తన నివాసంలో కన్వీనర్ రాయంకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గోపాల యాదవ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో అందరికీ అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి పని చేస్తానని తెలిపారు. సమావేశంలో మోరంపూడి సత్యనారాయణ, మందలపు కృష్ణారావు, సొసైటీ మాజీ అధ్యక్షులు గుర్రాల రవికుమార్, టౌన్ ప్రెసిడెంట్ నానాది సాగర్, గోరుముచ్చు శ్రీను, తమ్మిశెట్టి సుబ్రహ్మణ్యం నాయుడు, కొమ్మిన నరేష్, రామన్నపాలెం ఉప సర్పంచ్ పాల్గొన్నారు.

అనారోగ్యం కొనితెచ్చుకోవద్దు!

- చిన్నారులు, యువత పాలిట శాపంగా చిరుతిళ్లు
- ప్రతి గల్లీలో యథేచ్ఛగా విక్రయాలు
- కనీసం పట్టించుకునే అధికారులేరీ?
- జంక్ ఫుడ్‌తో పెరుగుతున్న ఆరోగ్య సమస్యలు



భీమడోలులో ఓ దుకాణం వద్ద రంగు రంగుల చిరుతిళ్ల ప్యాకెట్లు



పాఠశాలల్లో అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

భీమడోలు: రంగు రంగుల ప్యాకెట్లలో ఆకట్టుకునే చిరుతిళ్లు చిన్నారులు, యువత పాలిట శాపంగా మారుతున్నాయి. మారుతున్న జీవన విధానంతో జంక్ ఫుడ్స్‌కు అలవాటు పడిన చిన్నారుల ఆరోగ్యం దెబ్బ తింటుంది. కనీసం ఫుడ్ సేఫ్టీ అధికారులు పట్టించుకోకపోవడంతో చిన్నారుల ఆరోగ్యం ఆందోళనకరంగా మారుతుంది. ఉంగుటూరు నియోజకవర్గంలోని ప్రతి గల్లీలోనూ నాణ్యత లేని రంగు రంగుల ఆహార పదార్థాలే దర్శనమిస్తున్నాయి. వాటి తయారీదారులు జిమ్మిక్కులతో పిల్లలను ఆకట్టుకునేలా కార్టూన్లతో, రంగుల ప్యాకెట్లతో చిరుతిళ్లను తయారు చేసి విక్రయిస్తున్నారు. వాటికి అలవాటు పడిన పిల్లలు తల్లిదండ్రుల వద్ద మారం చేస్తూ వాటినే కొనుగోలు చేయించుకొని తింటున్నారు. క్వాలిటీని గాలికొదిలేసి పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నాసిరకం తినుబండారాలు అందిస్తూ పిల్లల ఆరోగ్యానికి చేటు చేస్తున్నారు.

తీవ్రమైన అనారోగ్య సమస్యలు

ప్రతి రోజూ ఇంట్లో పిల్లలు అంగట్లో చిరుతిళ్లను తిని అనారోగ్యం బారిన పడి తల్లిదండ్రులకు ఎన్నో కష్టాలు తెచ్చిపెడుతున్నారు. రసాయనాలు ఎక్కువ మోతాదులో ఉండడం వలన అనేక ఆరోగ్య సమస్యలు చోటు చేసుకుంటున్నాయి. తక్కువ ధరకు లభించడంతో వాటిని వినియోగిస్తున్నారు. పాఠశాలలకు వెళ్లే తరుణంలో ఇంట్లో డబ్బులు తీసుకొని పాఠశాల, అంగళ్లలోని చిరుతిళ్లను తినడంతో పిల్లలు బలహీనంగా తయారవుతున్నారు. ఎలర్జీలు, రక్తహీనత, ఊబకాయం, మధుమేహం, గ్యాస్, గొంతు సమస్యలు, కడుపు నొప్పి, జీర్ణ సమస్యలు, క్యాన్సర్, బరువు పెరగడం, శ్వాసకోశ సమస్యలు, అంతర్గత అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మానసిక అస్థిరతకు దారి తీస్తుంది. తాగే పాల నుంచి తినే తిండి ప్రతి ఒక్కటీ కల్తీ సరుకులు మార్కెట్‌లోకి వచ్చి అతలాకుతలం చేస్తున్నాయి. ఈ తరుణంలో సరైన పౌష్టికాహారం అందక అనారోగ్యంతో పాటు మందబుద్ధితో ఇబ్బందులు పడుతున్నారు. అంగట్లో దొరకే చిరుతిళ్లకు పిల్లలు దూరంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. తల్లిదండ్రులు వారిని అదుపు చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు. వాటిపై ప్రభుత్వం తగు చర్యలు తీసుకోకపోవడంతో యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పిల్లల ఆరోగ్య శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ని చిరుతిళ్లు, ఫాస్ట్ ఫుడ్స్‌కు ఎంత దూరం ఉంచగలిగితే అంత మంచిదని, లేని పక్షంలో ఆసుపత్రుల్లో చికిత్సలకు వేలాది రూపాయలు చెల్లించాల్సి వస్తుందని అంటున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని భీమడోలు, నిడమర్రు, ఉంగుటూరు, గణపవరం మండలాల్లోని 200 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 25 నుంచి 30 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

పర్యావరణానికీ విఘాతమే..

ఈ ప్యాకెట్లన్నీ ప్లాస్టిక్‌తో తయారు కావడం, వాడిన తరువాత వాటిని పారేయడంతో పరిసరాలు కాలుష్యానికి గురవుతున్నాయి. ప్లాస్టిక్ ఏళ్ల తరబడి కరగదు, పశువులకు సైతం హాని కలిగిస్తున్నాయి. ఇంట్లో తయారు చేసే తినుబండారాలు, తాజా పళ్లు, డ్రైఫ్రూట్స్, చిరుతిళ్లుగా వాడుకోవచ్చునని వైద్యులు చెబుతున్నారు.

జంక్ ఫుడ్స్ విక్రయాలపై అవగాహన కల్పిస్తున్నాం



జంక్ ఫుడ్స్ ప్యాకెట్లను విద్యార్థులు పాఠశాలలకు తీసుకొని రాకుండా అదే విధంగా విక్రయాలు జరగకుండా తగు చర్యలు తీసుకున్నాం. జంక్ ఫుడ్లను తినడం ద్వారా చిన్న వయస్సుల్లోనే అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. పిల్లల్లో దీర్ఘకాలిక సమస్యలు ఎదురవడంతో తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు జంకు ఫుడ్స్ వలన కలిగే అనర్థాలను పిల్లలకు వివరించి వాటికి దూరంగా ఉంచేలా అవగాహన కల్పిస్తున్నాం. పాఠశాలల్లో ఎండీఎం ఇచ్చే చిక్కీల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి.

–అయినపర్తి భాస్కర్‌కుమార్, ఎంఈవో–2, భీమడోలు

అనారోగ్య సమస్యలకు హేతువు.. జంక్ ఫుడ్స్



చిరుతిళ్లు తినడం వలన వారిలో రక్తహీనత, ఊబకాయం వంటి అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. రంగు రంగుల ప్యాకెట్లతో ఉండే ఆహార పదార్థాలు ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తున్నాయి. వాటి జోలికి పిల్లలు వెళ్లకుండా తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టిని సారించాలి. వైద్య ఆరోగ్య సిబ్బంది పాఠశాలల్లోనూ, గ్రామాల్లో వాటి వలన వచ్చే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నాం. పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రతలను పాటించడం ద్వారా ఆరోగ్యవంతులవుతారు.

–వైవీ లక్ష్మణరావు, ఎంపీహెచ్ఈవో, పీహెచ్‌సీ, పుళ్ల

ఉపాధ్యాయుడు ప్రకాష్ సేవలు ఆదర్శనీయం

పెదపాడు: ఉపాధ్యాయుడు జయ ప్రకాష్ సేవలు ఆదర్శనీయమని రెవరాండ్ ఫాదర్ మైకేల్ తెలిపారు. పెదపాడు మండలంలోని వసంతవాడ మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు కామ జయ ప్రకాష్ పదవీ విరమణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు సబ్బితి నర్సింహమూర్తి, ఎంఈవో–2 జంగం రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ బదిలీ ఉద్యోగులకు సత్కారం

ఉంగుటూరు: బదిలీ అయిన నాచుగుంట సచివాలయ ఉద్యోగులను గ్రామస్తులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, వంకిన పండు, మాజీ ఎంపీటీసీ కేశగాని సుబ్బారావు, గేలం వీరాంజనేయులు, ఇమ్మని గంగాధరరావు, సర్పంచి ఏలేటి సునీత సురేష్, ఎంపీటీసీ గంటా ఉషారాణి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గణపవరం: మండల సీపీఐ కార్యవర్గ ఎన్నికలు గణపవరం వర్తక సంఘ భవనంలో ఏకగ్రీవంగా నిర్వహించారు. మండల కార్యదర్శిగా పెనగంటి శ్రీనివాస్, సహాయకార్యదర్శిగా తాడేల వాసు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా పి.సత్యనారాయణ, యాళ్ల నాగేశ్వరరావు, సీహెచ్‌శ్రీను, పిల్ల నాగేశ్వరరావు, జి.రాజు ఎన్నికయ్యారు.